క్లుప్తంగా

జాతీయ సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సైబర్ అంబాసిడర్

కోరుట్ల: పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైబర్ జాగృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా జాతీయ సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ భద్రత ప్రాముఖ్యత, ఆన్‌లైన్ బెదిరింపుల నుంచి ఎలా రక్షించుకోవటం అనే అంశంపై పాఠశాల సైబర్ అంబాసిడర్ సీహెచ్ నాగరాజు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఉండటానికి, ఆన్‌లైన్ దాడులు, అరెస్టులపై తీసుకోవలసిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూషణరావుపేట వాసికి జ్యోతిష్య ఆచార్య అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

కథలాపూర్: మండలం భూషణరావుపేట గ్రామానికి చెందిన అల్లె వెంకటేశ్వర్లు సోమవారం హైదరాబాద్‌లో జ్యోతిష్య ఆచార్య అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో వేదిక్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(విస్రో) ఆధ్వర్యంలో 'ఆస్ట్రో ఉత్సవ్–2025' కార్యక్రమం నిర్వహించారు. అల్లె వెంకటేశ్వర్లు ఈ ప్రాంతంలో ప్రముఖ జ్యోతిష్యులుగా పేరుగాంచారు. వెంకటేశ్వర్లు మాస్టర్స్ ఇన్ ఆస్ట్రోలాజీ ఇటీవలే పూర్తి చేశారు. విస్రో సంస్థ చైర్మన్ కృష్ణకాంత్ శర్మ చేతుల మీదుగా వెంకటేశ్వర్లు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఫర్టిలైజర్ షాపుల్లో శాంపిల్ సేకరణ

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో అమ్ముతున్న పురుగుల మందులను నాణ్యతగా ఉన్నాయా, లేవా అని వాటి నమునాలను సోమవారం ఏవో రాజ్‌కుమార్ సేకరించారు. పురుగుమందులను నాణ్యత పరీక్ష కోసం సేకరించి వాటిని హైదరాబాద్‌లోని పురుగుమందుల పరీక్ష కేంద్రానికి పంపినట్లు ఏవో రాజ్‌కుమార్ తెలిపారు.

అమృత మంజరి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న వక్తలు

కోరుట్ల: పట్టణంలో మనుజ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో దేవాశీర్ లారీ ప్రొడక్షన్స్ వారిచే అమృత మంజరి పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మనుజ్యోతి ఆశ్రమం మానవాళికి వెలుగుగాను, జ్ఞాన నిధిగా ఉంటుందని పేర్కొన్నారు. శ్రీమన్నారాయణ శ్రీ లహరీ కృష్ణ 1953లో స్థాపించిన మనుజ్యోతి ఆశ్రమం గత 72 ఏళ్లగా కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మణ్, పరందాం, మంచాల జగన్, రాంగోపాల్, చంద్రశేఖర్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

'చాగంటి' ప్రవచనాలకు స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అధికారులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 11,12 తేదీల్లో జరగనున్న చాగంటి కోటేశ్వర్‌రావ్ ప్రవచనముల కార్యక్రమానికి సోమవారం స్థలం పరిశీలించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనల మేరకు స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనున్న శ్రీ మఠం స్థలంలో దేవస్థానం ఆధ్వర్యంలో పరిశీలించారు. సుమారు 20 వేల మంది భక్తులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, నాయకులు ఎస్ దినేశ్ తదితరులున్నారు.

అస్తవ్యస్తంగా కాంటూర్ కందకాలు



కాంటూర్ కందకానికి నిర్మించిన చెక్‌డ్యాం



చెక్‌డ్యాం నుంచి రైతుల పొలాల్లోకి చేరిన ఇసుక

- అటవీ భూములకు రక్షణగా కందకాలు
- ప్రస్తుతం ఆనవాళ్లు కోల్పోయిన వైనం
- పునరుద్ధరించాలని కోరుతున్న రైతులు

సారంగాపూర్: అడవులను సంరక్షించడానికి, వర్షపు నీరు వాగుల ద్వారా గోదావరిలోకి చేరకుండా ఎక్కడ పడిన నీటి చుక్క అక్కడే ఇంకి భూగర్భ జలాలు పెంచడానికి గతంలో ఏర్పాటు చేసిన కాంటూర్ కందకాలు అస్తవ్యస్తంగా మారాయి. వీటిని తిరిగి పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు..

కాంటూర్ కందకాలు..

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని అటవీప్రాంతాలను సంరక్షించడానికి 1997–98లో అటవీశాఖ అధికారులు అడవుల చుట్టూ కాంటూర్ కందకాలను తవ్వించారు. అడవుల చుట్టూ అటవీశాఖ తన హద్దులను ఏర్పాటు చేయడంతో పాటు, అడవుల్లోకి కలప దొంగలు ప్రవేశించకుండా అటవీశాఖ హద్దుల్లో 50 మీటర్ల పొడవు, 6మీటర్ల లోతు, 6 మీటర్ల వెడల్పుతో కాంటూర్ కందకాలను తవ్వించింది. రెండు మండలాల్లో వందల కిలోమీటర్ల మేర లక్షలాది రుపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన కందకాలతో అటవీప్రాంతంలోకి కలప స్మగ్లర్లు పోకుండా అరికట్టింది. దీంతోపాటు అటవీశాఖ భూముల్లోకి ఇతరులు చొరబడి ఆక్రమించకుండా ఈ కందకాలు రక్షణగా నిలిచాయి. వర్షాకాలంలో వర్షాలకు గుట్టల పై నుంచి వచ్చే నీటితో పాటు, వాగుల ద్వారా వచ్చే నీరు కాంటూర్ కందకాల్లోకి నీరు చేరి భూగర్భ జలాల పెంపు గణనీయంగా పెరిగింది. కందకాల్లో చేరిన నీరు భూమిలోకి ఇంకిపోయి దిగువన ఉన్న రైతుల బావుల్లో నీటి నిల్వలు పెరిగినట్లు రైతులు ప్రత్యక్షంగా గుర్తించారు.

మట్టి, ఇసుకతో నిండిన కందకాలు

కందకాలు తవ్వించి ఏళ్లు గడిచిపోవడంతో వర్షాకాలం గుట్టల నుంచి వచ్చే నీరు, వాగుల ద్వారా వచ్చే వరదలతో నీరు, నీటితో పాటు మట్టి, ఇసుక వచ్చి కందకాల్లో చేరి కందకాలు పూర్తిగా ప్రస్తుతం ఇసుక, మట్టితో నిండి ఆనవాళ్లు కోల్పోయాయి. దీంతో కందకాల నుంచి రైతుల పొలాల్లోకి మట్టి, ఇసుక భారీగా చేరింది. కాంటూర్ కందకాలను తిరిగి నిర్మాణం చేస్తే అడవుల్లోకి అక్రమ కలప రవాణాదారులు వెళ్లకుండా ఉపయోగపడుతుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాంటూరు కందకాలను తవ్వించాలని రైతులు కోరుతున్నారు.





మల్లాపూర్: మండలంలోని వాల్గొండలో అంతర్గత రహదారులపై చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది చెత్తా చెదారాన్ని తీసి రోడ్లపై కుప్పలు వేసి 10 నుంచి 15 రోజులు గడుస్తున్నా.. డంపింగ్ యార్డ్‌కి తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దుర్గంధం కారణంగా ఎలాంటి రోగాల బారిన పడాల్సి వస్తుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై చెత్త కుప్పలు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వసంత్, పంచాయతీ కార్యదర్శి, వాల్గొండ, సెల్ నంబర్: 9603339090

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అధ్వానంగా.. కల్లూర్ రోడ్డు



బురదమయమైన కల్లూరు రోడ్డు

కోరుట్లటౌన్: పట్టణంలోని కల్లూర్‌రోడ్ అధ్వానంగా మారింది. వర్షాలతో బీటీ రోడ్డు దెబ్బతింది. బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రజలు, వాహనదారులు ఎక్కువగా ప్రయాణం చేస్తారు. అధికార ఎమ్మెల్యే భవనం, మున్సిపల్, రిజిస్ట్రేషన్ కార్యాలయం, ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం, కో–ఆపరేటివ్ బ్యాంకు, విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు ప్రైవేటు బ్యాంకులు, వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ట్రాన్స్‌పోర్టు ఏరియా కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలు ఎక్కువగా వెళ్తూ రద్దీగా ఉంటుంది. దీంతో ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ట్రాఫిక్ సమస్యలు పదే పదే తలెత్తుతాయి.



గుంతలు పడిన రోడ్డు

ఇటీవల కురిసిన వానలకు కల్లూర్ రోడ్ దారి పొడవునా రోడ్డుకు ఇరు వైపులా గుంతలు పడి, వర్షపు నీళ్లు నిలిచాయి. ముఖ్యంగా కల్లూర్‌రోడ్ రైల్వే బ్రిడ్జి ప్రదేశం బీటీ రోడ్డు ఆనవాళ్లు కనబడుతలేవు. బురద,పెద్ద పెద్ద గుంతలు పడి రాత్రి వేళ ఈ రోడ్డు వెంబడి వెళ్లడం కష్టంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు సమస్య పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రతీ కార్యకర్తకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షులు చింతల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు నాలుగు కౌంటర్లు

కథలాపూర్: మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా... నామినేషన్లు దాఖలు చేసేందుకు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు. పెగ్గెర్ల, భూషణరావుపేట, సిరికొండ ఎంపీటీసీ స్థానాలకు ఒకటో కౌంటర్‌లో నామినేషన్లు అందించాలన్నారు. తక్కళ్లపెల్లి, కథలాపూర్, చింతకుంట ఎంపీటీసీ స్థానాలకు రెండో కౌంటర్‌లో నామినేషన్లు అందించాలన్నారు. దుంపేట, బొమ్మెన, గంభీర్‌పూర్ ఎంపీటీసీ స్థానాలకు మూడో కౌంటర్, తాండ్ర్యాల, పోతారం, కలిగోట, అంబారిపేట ఎంపీటీసీ స్థానాలకు నాలుగో కౌంటర్‌లో నామినేషన్లు దాఖలు చేయాలని అధికారులు వివరించారు. ఈ మేరకు నామినేషన్లు స్వీకరించేందుకు రిటర్నింగ్ ఆఫీసర్లను, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించి శిక్షణ ఇచ్చినట్లు అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడ సేవ

కోరుట్లటౌన్: పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం సాయంత్రం 6:30 నిమిషాలకు గరుడ సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఎతిరాజం నర్సయ్య, కార్యనిర్వహణాధికారి విక్రమ్ సోమవారం తెలిపారు. ఏర్పాట్లు పూర్తయినట్లు వారు తెలిపారు. మహిళలు మంగళహారతులతో వెంకన్న స్వామి వారికి స్వాగతం పలకాలని కోరారు.

యాదవులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయాలి

సారంగాపూర్: యాదవులు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి పాలకులుగా ఎదగాలని యాదవ సంఘం జగిత్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని అర్పపల్లిలో యాదవులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పుల్లే పెద్ద రాజన్న, చిన్న రాజన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

జగిత్యాలటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగిరేసి సత్తా చాటాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శుభమస్తు కన్వెన్షన్‌లో స్థానిక సంస్థల సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబుతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి, నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల తిరుపతిరెడ్డి, మ్యాదరి అశోక్, పాత రమేష్, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భోగ శ్రావణి

అఖిల భారత యాదవ మహాసభ యూత్ కార్యవర్గం

మేడిపల్లి: అఖిల భారత యాదవ మహాసభ భీమారం మండల యూత్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట్ల మహేశ్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శిగా జాల మల్లేశం యాదవ్, ఉపాధ్యక్షులుగా భూపతి రంజిత్ యాదవ్, కార్యదర్శి దండిగా మనోజ్ యాదవ్ , కార్యవర్గ సభ్యులుగా పంచాతి మనోజ్ యాదవ్, జాల మనోజ్ యాదవ్, అంగ గంగారాజం యాదవ్ , తోట్ల మల్లికార్జున్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేష్ యాదవ్, మండల అధ్యక్షుడు ఆదె రమేష్ యాదవ్, బొడ్డు బక్కన్న యాదవ్, భీమారం మండల అధ్యక్షుడు రెబ్బస్ మల్లయ్య యాదవ్, బెనవేని రెడ్డి యాదవ్, మోహన్ యాదవ్, గంగారం యాదవ్ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం

ఆశావహుల ప్రచారం షురూ

మల్యాల: మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ఆశావహులు ఈ నెల 8 వరకు హైకోర్టు తీర్పుతో ఎన్నికలు రీషెడ్యూల్ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కూడా ఆశావహులు మాత్రం ప్రచారం ఆపడం లేదు. ఒక్కో గ్రామంలో ఒక్కో పార్టీకి ముగ్గురి చొప్పున పార్టీ టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమకే టికెట్ వస్తుందనే ధీమాతో తమ సన్నిహితులు, స్నేహితులతో కలిసి ఎన్నికల వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఆయా ఎంపీటీసీ పరిధిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, ఎంతమంది తమకు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది.. అనే అంశాలపై చర్చించుకుంటూనే మేరకు కులాల వారీగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. మల్యాల మండలంలో కాంగ్రెస్ తోపాటు ఇటు బీఆర్‌ఎస్, అటు బీజేపీ దాదాపు అన్ని గ్రామాల్లో పట్టు ఉండడంతో ఎంపీటీసీ ఎన్నికల్లో తీవ్రమైన పోటీ ఉండే అవకాశం ఉంది.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుల గడువు పెంపు

కోరుట్లటౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) గడువు ఈ నెల 14 వరకు పొడిగించినట్లు ఎంఈవో గంగుల నరేశం సోమవారం తెలిపారు. అక్టోబర్ 6 గడువు కావడం, దసరా సెలవులు రావడంతో ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తులు చేయడం కుదరలేదు. దాంతో విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఎక్కువ మంది ప్రతిభ ఉన్న విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు అక్టోబర్ 14 వరకు గడువు పెంచారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మోడల్, ఎయిడెడ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఇబ్రహీంపట్నం: గుంతల రోడ్డుతో కాలనీకి వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నామని ఎవరు పట్టించుకోవడం లేదని, రోడ్డును బాగు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వరప్రసాద్‌కు మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కు డబుల్ బెడ్‌రూం కాలనీవాసులు విన్నవించారు. కాలనీకి వెళ్లేందుకు రోడ్డును వేయకపోవడంతో పాటు వీధి దీపాలను కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడి నీళ్లు నిలిచి నడువరాని పరిస్థితి నెలకొందని వెంటనే అధికారులు పట్టించుకొని గుంతలను పూడ్చి వేసి రోడ్డును బాగు చేయాలని కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు చెట్‌పల్లి నరేందర్, అబ్దుల్ బాబా, జాదవ్‌రామ్, నవ్య, స్వప్న, గంగు, మోతీలాల్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఆరెల్లి గాయత్రికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు మంజూరు కాగా, సోమవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గుజ్జుల మోహన్‌రెడ్డి, నాయకులు హరీశ్‌రావు, రాజేశ్వర్ రావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

మల్యాల: ముత్యంపేట శివారులోని జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై శనివారం రాత్రి కారు–బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోరుట్లకు చెందిన దాసరి సుశీల్‌కుమార్ తన స్కూటీపై వెళ్తుండగా, గోదావరికి చెందిన కారు పంచముఖ ఆంజనేయస్వామి సమీపంలో బైక్‌ను ఎదురుగా ఢీకొనడంతో సుశీల్‌కుమార్ తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్పీని కలిసిన ప్రతిభ



డీఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రతిభ

జగిత్యాలక్రైం: గ్రూప్–1 ఫలితాల్లో సారంగాపూర్ మండలం అర్పపల్లికి చెందిన ప్రతిభ డీఎస్పీగా ఎంపిక కాగా, సోమవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రతిభను ఘనంగా సన్మానించారు.

అదుపు తప్పి బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

మల్యాల: మండలకేంద్రం నుంచి కొండగట్టుకు వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ బోల్తాపడింది. సోమవారం సాయంత్రం ముత్యంపేట పంచాయతీ భవనం సమీపంలో మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ట్రాక్టర్‌లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి నష్టమూ వాటిల్లలేదు.



రోడ్డుపై బోర్లాపడ్డ ట్రాక్టర్